డాక్టర్ అవ్వాలనే కల చెదిరిపోయింది



ఈ సంవత్సరం నీట్ ఎంట్రెన్స్ పరీక్ష రాశాను. గత ప్రభుత్వం నిర్మించిన వైద్య కళాశాలల్లో సీట్లు కేటాయించి ఉంటే నాకు సీటు దక్కే అవకాశం ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సీట్లు కేటాయించకపోవడంతో నాలాంటి చాలా మంది విద్యార్థుల డాక్టర్ అవ్వాలనే కల చెదిరిపోయింది. ఈ అంశంపై వైద్య శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలు దారుణం. నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన మంత్రి ఇలా గత ప్రభుత్వంపై నెపం వేయడం బాధించే అంశం. ప్రభుత్వం నిర్మించిన కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలనుకునే విషయాన్ని వెనక్కి తీసుకోవాలి.

– ఈ.ప్రవల్లిక, నీట్ విద్యార్థిని, గాలివీడు



మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు సిగ్గుచేటు



మెడిసిన్ చదివే విద్యార్థులకు మెడికల్ కాలేజీలు నిర్మించి ఆసరాగా ఉండాల్సిన ప్రభుత్వం ఆదిశగా పని చేయకుండా విస్మరిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను అభివృద్ధి చేయకుండా ప్రైవేటు పరం చేస్తామంటూ ప్రకటించడం విడ్డూరంగా ఉంది. జగన్ నువ్వు పాఠాలు చెబుతావా అంటూ మంత్రి సత్యకుమార్ మాట్లాడటం సిగ్గుచేటు, ఆయన మతిభ్రమించి మాట్లాడుతున్నారు.

– సింగం నీలకంఠారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్, సిద్దవటం

క్లుప్తంగా

శివాలయాలలో ప్రత్యేక పూజలు



అలంకరణలో భుజంగేశ్వరుడు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవ రాజపురం, పట్టణంలోని భుజంగేశ్వర ఆలయాలలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని శివలింగానికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించి అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని కొండపై వెలసిన శ్రీ కాలభైరవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయంలో ఆలయ ధర్మకర్త ధర్మారెడ్డి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చదువులలో సత్తాచాటిన మహేష్

రామాపురం : చదువుకు పేదరికం అడ్డుకాదని నల్లగుట్టపల్లె పంచాయతీ బి.రాచపల్లెకు చెందిన మహేష్‌యాదవ్ రుజువు చేశాడు. పాతూరి వెంకటరమణ, గంగాదేవిల కుమారుడు మహేష్, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. కుటుంబభారం తల్లిపై పడింది. ఉపాధి నిమిత్తం మహేష్ తల్లి గల్ఫ్‌కు వెళ్లడంతో లక్కిరెడ్డిపల్లె మండలం గొల్లపల్లెలో ఉన్న అమ్మమ్మ దగ్గర ఉంటూ చదువు సాగించాడు. ఈ ఏడాది జరిగిన నీట్‌లో సత్తాచాటి 637 మార్కులతో రాష్ట్రస్థాయి 881 ర్యాంక్ సాధించాడు. దీంతో ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మెడిసిన్‌లో చేరాడు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు, బంధువులు మహేష్ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన కొరముట్ల



ఎంపీతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలపై రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డితో సోమవారం మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు చర్చించారు. రైల్వే అండర్ బ్రిడ్జ్, చిట్వేలి రోడ్డు విస్తరణతోపాటు పలు అంశాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఎల్వీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రైల్వేకోడూరు అర్బన్ : ఎస్.కొత్తపల్లి వైస్ సర్పంచ్ యామల రాజా కుటుంబానికి వైఎస్సార్‌సీపీ తరపున అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సోమవారం తెలిపారు. రాజా మరణ వార్త తెలుసుకున్న నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ యామల రాజ పార్టీలో క్రియాశీలకంగా పని చేసేవాడన్నారు. ఆయన పార్టీ కోసం ఎంతో సేవ చేశారని చెప్పారు. రాజ కుటుంబాన్ని అన్ని విధాల అదుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సర్పంచ్‌లు సుజాత, రామకృష్ణ, హరికృష్ణలు, షఫీ, వెంకటరెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి

గాలివీడు : రాష్ట్రంలో చేనేతలు, చేనేత పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీరభాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలం నూతన కమిటీ సోమవారం ఎన్నుకున్నామన్నారు. అధ్యక్షుడుగా శిబ్యాల వెంకటరమణ, కార్యదర్శి మోడెం రాము, ఉపాధ్యక్షులు పురుం కృష్ణమూర్తి, ఓర్సు ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు ఓర్సు పవన్ కుమార్, ప్రసాద్, నాగయ్య, లక్ష్మీనారాయణ, జయరాంలను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేతల సమస్యలను పరిష్కరించాలన్నారు. చేనేత వస్త్ర ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలన్నారు. నేతన్న నేస్తం పథకాన్ని 48 వేలకు పెంచాలని, చేనేత ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

కాలిన గదుల్లోనే కార్యాలయం



కిటికీలు, దోర్లు పూర్తిగా లేని పశు వైద్యశాల

పక్కన ఫొటోల్లో మనం చూస్తున్నది పాడుబడిన భవనం అనుకుంటే పొరపాటే. ఇది వీరబల్లె మండల ప్రభుత్వ పశు వైద్యశాల. గతేడాది విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కార్యాలయం పూర్తిగా కాలిపోయింది. ఈ విషయాన్ని అప్పటి కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారుల దృష్టి మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తీసుకెళ్లిన ఇప్పటికీ ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో సిబ్బంది చేసేది ఏమీలేక మరో భవనం దొరకక ప్రమాదానికి గురైన ఈ కార్యాలయంలోనే ఒక గదిలో కార్యాలయ సామగ్రి, రికార్డులను భద్రం చేసుకుంటూ విధులు సాగిస్తున్నారు. కార్యాలయానికి తలుపులు, కిటికీలు లేకపోవడంతో కార్యాలయంలోని మందులు, సామగ్రికి భద్రతలేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పశు వైద్యశాలకు మరో భవనం కేటాయించాలంటూ పశు వైద్యాధికారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

– వీరబల్లి



అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన గోడలు

బీకేఎం స్ట్రీట్‌లో అగ్నిప్రమాదం

కడప అర్బన్ : నగరంలోని బీకేఎం స్ట్రీట్‌లో అమ్మవారిశాల వెనుక ఓ నివాసంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న కడప అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంటిలోని సామాన్లతోపాటు జీడిపప్పు, బిరియాని తదితర వంటలకు వాడే సరుకులు కాలిపోయాయన్నారు. దీంతో యజమాని పి.జాషుకు రూ. 50,000 ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి పి.బసివిరెడ్డి తెలియజేశారు.

శిక్షణ ఇచ్చారు.. అమలు మరిచారు

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు



పుల్లంపేటలోని చెత్త నుంచి సంపద కేంద్రం

పుల్లంపేట : 2014 – 19 సంవత్సరంలోని తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నుండి సంపదను సృష్టించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామ పంచాయతీలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ. 10 లక్షలు వెచ్చించి చెత్త నుంచి సంపద కేంద్రాలను 2017–18 ఆర్థిక సంవత్సరంలో నిర్మించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు నెల క్రితం మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించింది. ప్రతి సర్పంచ్, సచివాలయాల సిబ్బందికి పంచాయతీల్లోని సంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని, వాటి ద్వారా ఆదాయం ఎలా సమకూర్చుకోవాలి, తడి, చెత్తను ఎలా వేరు చేయాలనే అంశంపై శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. అయితే శిక్షణ పూర్తయ్యి 40 రోజులు అయినప్పటికీ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రతి గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలు చేసి సంబంధిత నగదును జనరల్ ఫండ్‌లో జమ చేయడం ద్వారా సర్పంచ్‌లు లెక్కలు చూపించుకొని ఉన్న సొమ్మును స్వాహా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీలలో చెత్త ఊరి చివర లేదంటే ఖాళీ ప్రదేశాలలో పారవేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల కోడూరు పర్యటనలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి పదిహేనవ ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యాయని, వాటిని ఆయా పంచాయతీ సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అయితే ఇంతవరకు ఎక్కడా మండల వ్యాప్తంగా పనులు జరిగిన పాపాన పోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతి గ్రామం పంచాయతీలోని చెత్త నుంచి సంపద కేంద్రాలను వాడుకలోకి తేవాలని పంచాయతీలోని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో వాడుకలోకి తెస్తాం



మండలంలోని పుల్లంపేట, పుత్తన వారిపల్లి గ్రామాలలో ప్రస్తుతం చెత్త నుంచి సంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకువచ్చాం. మిగిలిన గ్రామాల్లోనూ అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆయా పంచాయతీల్లోనే వినియోగిస్తాం.

– పెంచలయ్య, ఈఓపీఆర్‌డీ, పుల్లంపేట

ఐదేళ్లలో రాయచోటి రూపురేఖలు మారుస్తా

లక్కిరెడ్డిపల్లె : వచ్చే ఐదేళ్లలో రాయచోటి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం అనంతపురం గంగమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, లక్ష్మీప్రసాద్ రెడ్డి, ఎనమల మదన్‌మోహన్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

చిన్నమండెం : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన బోరెడ్డి గారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.



లక్కిరెడ్డిపల్లె: అనంతపురం గంగమ్మకు పూజలు చేయిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ప్రజలందరిపై కరుణాకటాక్షాలు ఉండాలి

రాయచోటి టౌన్ : ప్రజలందరిపైన వినాయకుడి కరుణకటాక్షాలు ఉండాలని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం రాయచోటిలోని శ్రీ ఉమామహేశ్వరి స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన నిర్వాహకులు అరమాటి శివగంగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.ద్వారకనాథరెడ్డి, ఎం.శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారులపై రెడ్‌బుక్ కుట్ర



పి.విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

రాజంపేట : నిజాయితీగా సేవలందించిన ఐపీఎస్ అధికారులపై కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ ఆధారంగా కక్షసాధింపు చర్యలకు దిగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి (విస్సీ) అన్నారు. సోమ వారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ముంబై నటి జెత్వానీ పేరుతో పీఎస్ఆర్, కాంతి రాణా, విశాల్ గున్నీలను సస్పెన్షన్ చేయించడం కూటమి ప్రభుత్వం పన్నాగమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా పాలన అందించిన ఐపీఎస్ అధికారుల పట్ల కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఇప్పటికే ఐపీఎస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోందన్నారు. కూటమి పాలనలో కేసులు, దౌర్జన్యాలు, ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను లొంగదీసుకునేందుకు వివిధ రకాల బెదిరింపులకు పాల్పడటం యథేచ్ఛగా కొనసాగుతోందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చిత్తశుద్ధి చూపకుండా, అనైతిక, అప్రజాస్వామిక రాజకీయాలను చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధ్వంసక, ప్రజా వ్యతిరేక వైఖరిని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయడమే కాక ప్రజాపోరాటాలు చేస్తామన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుకపాలసీ ప్రజలకు కష్టాలను తెచ్చిపెడుతోందని, ఉచితం అని చెప్పి ప్రజల చెవ్వులు ముఖ్యమంత్రి పువ్వులు పెట్టారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన పంథా మార్చుకుని ప్రజాసంక్షేమానికి కృషి చేయాలని హెచ్చరించారు.

20 నుంచి ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

రాజంపేట టౌన్ : ఈనెల 20వ తేదీ నుంచి తొమ్మిది రోజులపాటు మాజీ సమితి అధ్యక్షుడు దివంగత పోలా వెంకటరెడ్డి శతజయంతిని పురస్కరించుకొని ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట పట్టణం ఆర్ఎస్ రోడ్డులోని కాకతీయ విద్యాసంస్థల ఆవరణలో శంకర నేత్ర కంటి వైద్యశాల, కాకతీయ విద్యాసంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 ప్రముఖ వైద్య నిపుణులు కంటిపొరను పరిశీలిస్తారన్నారు. కంటి శుక్లం (పొర) ఉన్నవారికి ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కాకతీయ విద్యా సంస్థల ఆవరణలోనే శంకరనేత్రాలయ హాస్పిటల్‌కు చెందిన మొబైల్ ఆపరేషన్ థియేటర్‌లో ఆపరేషన్‌ను ఉచితంగా చేయించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి కుట్లు లేకుండా అత్యాధునిక పద్ధతిలో వైద్యులు ఆపరేషన్లను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అవసరమైన వారికి ఐఓఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులను ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. ఆపరేషన్ అనంతరం పేషెంట్లను వైద్యులు రెండు గంటలపాటు వారి పర్యవేక్షణలో ఉంచుకొని అనంతరం ఇంటికి పంపిస్తారన్నారు. బీపీ, షుగర్ ఇతర వ్యాధులు ఉన్న వారు రోజు వాడే మందులను తమ వెంట తీసుకురావాలన్నారు. వైద్య శిబిరంలో పాల్గొనే పేషెంట్‌కు వారికి తోడుగా వచ్చే ఒకరికి ఉచితంగా భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వైద్యశిబిరానికి వచ్చే రోగి తమవెంట ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, సెల్‌ఫోన్ నెంబర్ తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోలా వెంకటరమణారెడ్డి కోరారు.

ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : మండలంలోని బండపల్లె వాసి ఊరగాయల బసిరెడ్డి (75) అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రీకాంత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, గాలివీడు మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి, రామాపురం వైస్ ఎంపీపీ రవి శంకర్‌రెడ్డి, నాయకులు రామ్ బసిరెడ్డి, రాజారెడ్డి, కోటి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జన వేడుకలు



రాయచోటి జగదాంబ సెంటర్: నిమజ్జనానికి తరలుతున్న బోస్‌నగర్ గణేశుడు



రాజంపేట టౌన్: ఇక సెలవంటూ నిమజ్జనానికి ప్రత్యేక వాహనంలో బయలుదేరిన గణనాథుడు



నందలూరు: నిమజ్జన వేడుకలో పాల్గొన్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు

రాజంపేట టౌన్ : ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు సోమవారంతో ముగిశాయి. వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని రాజంపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 255 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాగా చవితి పండుగ రెండవ రోజు నుంచే నిమజ్జన వేడుకలు ప్రారంభమయ్యాయి. పదవ రోజైన సోమవారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, బ్యాండు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ కోలాహలంగా నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. నిమజ్జనానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు చేయడంతో ఈ సారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.

నందలూరు : నాగిరెడ్డిపల్లి పంచాయతీలోని కాపు వీధి వద్ద నాగిరెడ్డిపల్లి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిమజ్జన కార్యక్రమానికి సోమవారం ముఖ్య అతిథిగా ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వినాయక స్వామి నిమజ్జన కార్యక్రమాన్ని టెంకాయ కొట్టి నిమజ్జన రథాన్ని కదిలించారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు కలీముల్లా ఖాన్, మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, వేణుగోపాల్ రెడ్డి, గంగిరెడ్డి, తుమ్మల శ్రీధర్ గౌడ్, పెనుబాల నాగసుబ్బయ్య, విజయుడు, గంగిరెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి (జగదాంబసెంటర్) : రాయచోటి పట్టణం బోస్‌నగర్ సైదియా థియేటర్ వెనుక వైపున పూజలందుకున్న గణేషుడి నిమజ్జనాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పది రోజులుగా విఘ్ననాథునికి పూజలను సమర్పించిన నిర్వాహకులు ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో యువకులు, చిన్నారులు పాల్గొని బొజ్జ గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు.

రాయచోటి టౌన్ : పట్టణంలోని చెక్ పోస్టు వద్ద వెలసిన శ్రీ ఉమామహేశ్వరి ఆలయంలో వినాయక ఉత్సవ విగ్రహ నిమజ్జన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ కార్య నిర్వహకులు అరమాటి శివగంగిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు నటరాజ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్ నాయుడు ఆధ్వర్యంలో పంచలోహ విగ్రహంతో ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉన్న గణనాథులను ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లెలో పూజలందుకున్న గణనాథుని ఊరేగింపు బాజాభజంత్రీలు బాణాసంచా పేలుళ్ల మధ్య ఊరేగించారు. అనంతరం శ్రీనివాసపురం రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.

రామాపురం : మండలంలోని గణేష్ నిమజ్జన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాలలో ప్రధాన ప్రాంతాల్లో ప్రతిమలను ఏర్పాటు చేశారు. 3వ రోజు నుంచి నిమజ్జన కార్యక్రమాలను కమిటీ నిర్వాహకులు చేస్తూ వస్తున్నారు.

కాగా సరస్వతిపల్లె గ్రామం నాయునివారిపల్లెలో గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యువతీ, యువకులు ఉత్సాహంతో పాల్గొన్నారు. చెక్కభజన బృందం అందరినీ ఆకట్టుకుంది.



రామాపురం: నిమజ్జనానికి తరలివెళ్తున్న సరస్వతిపల్లె గ్రామ వినాయకుడి ప్రతిమ



రాయచోటి టౌన్: ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న గణనాథుడు



చిన్నమండెం: ఊరేగింపుగా గంగ ఒడికి వెళ్తున్న బోరెడ్డిగారిపల్లె వినాయకుడు

శాస్త్రీయ విద్యావిధానం అమలుకు పోరాటం

రైల్వేకోడూరు అర్బన్ : పోరాటాలు, త్యాగాలు ఫలితంగానే ఏఐఎస్ఎఫ్ ఏర్పడిందని జిల్లా అధ్యక్షులు మాధవ్ సోమవారం తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యార్థుల సమస్యలు పోరాటాల త్యాగాల ఫలితంగానే ఏర్పడిందన్నారు. యువకుల్లో దేశభక్తి మెండుగా నింపిదన్నారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలు ఎందరో చేశారని చెప్పారు. శాస్త్రీయ విద్యా విధానం అమలుపై నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులుగా నాగేంద్ర, ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలు నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షుడు మాధవ్

రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టండి

గాలివీడు : కరిమిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో కూలిన ప్రహరీ గోడకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రహరీ గోడ కూలి ఐదేళ్లయినా ఉపాధ్యాయులు, విద్యాధికారులకు సమస్యను తెలియజేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. రక్షణ గోడ లేకపోవడంతో పాఠశాలలోకి విష సర్పాలకు వస్తున్నాయని చెప్పారు. అలానే చీకటి పడితే పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. ఇప్పటికైనా పాఠశాల రక్షణగోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కూలిన పాఠశాల ప్రహరీ గోడ

దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపాం

- కాలుష్య ప్రభావిత గ్రామాలకు ప్యాకేజీ, పునరావాసం వైఎస్సార్‌సీపీ ఘనత
- గ్రామాల పునరావాస కల్పనలో టీడీపీ చేసింది శూన్యం



వత్తలూరు సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : గత ప్రభుత్వంలో నిర్వాసితులకు సిద్ధం చేసిన ఇంటి పట్టాలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కూటమి పార్టీల నాయకులు హడావిడిగా పంపిణీ చేయడంతో నిర్వాసితులకు ఒరిగిందేమీలేదని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన కొర్లకుంట క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మంగంపేట, కాపుపల్లి, హరిజనవాడు, అరుంధతివాడ గ్రామాల ప్రజలు కాలుష్యంతో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతూ అనేక వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక దాదాపు రూ.400 కోట్లు పునరావాసం కోసం కేటాయించారని గుర్తు చేశారు. అప్పటి గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిల సహకారంతో మూడు గ్రామాల ప్రజలకు పునరావాసం కోసం భూసేకరణ జరిపి ప్లాట్లు ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్టీలకతీతంగా వివక్షలేకుండా అందరికీ ప్యాకేజీలు, పరిహారం ఇచ్చారన్నారు. మెరుగైన పునరావాసం కోసం విశాలమైన రోడ్లు, విద్యుత్, నీటి వసతి కల్పించి ప్లాట్లు ఏర్పాటు చేసి పట్టాలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మూడు గ్రామాల ప్రజలకు మిగిలి ఉన్న ప్యాకేజీలు, పరిహారం, సమస్యలు పరిష్కరించకుండా ఇప్పటికే సిద్ధం చేసిన ఇంటి పట్టాలను మంత్రి హడావుడిగా పంపిణీ చేయడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ ప్రభుత్వం కాలుష్య గ్రామాల పునరావాసం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.